మధ్యాహ్న భోజనం నాణ్యత లేకుంటే చర్యలు

ప్రజాశక్తి-అనంతగిరి:మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకుంటే పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకుల పై చర్యలు తప్పవని రాష్ట్ర మధ్యాహ్న ఆహార పథకం పర్యవేక్షక అధికారులు హెచ్చరించారు. శనివారం కాశీపట్నం మండల ప్రాథమిక ఉన్నత ప్రైమరీ పాఠశాలలో మధ్యాహ్న ఆహార పథకం పర్యవేక్షక అధికారులు అకస్మాత్తుగా పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షక (సీఐ)జి.వెంకటరావు, రవికుమార్ తనిఖీలు నిర్వహించారు. భోజన సదుపాయం, అమలుతీరును విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టామన్నారు. సీఐ వెంకటరావు విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. సి ఐ మాట్లాడుతూ, రోజువారీ మెనూ కచ్చితంగా పాటిం చాలని సూచించారు.

పరిశీలిస్తున్న అధికారులు

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా..

నేడు పాడేరులో రాష్ట్ర విద్యా సదస్సు

◆యుటిఎఫ్ జీపుజాతాలో వచ్చిన సమస్యలపై చర్చ ◆తరలిరానున్న ఉపాధ్యాయ ప్రతినిధులు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ శాఖలోని విద్యా రంగ సమస్యల పరిష్కారానికై అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో ఈనెల 20న ఆదివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును నిర్వహిస్తోంది. గత అక్టోబర్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటీడీఏల పరిధిలో యుటిఎఫ్ జీపుజాతా నిర్వహించింది. కొన్నేళ్లుగా గిరిజన విద్యా రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా గుర్తించింది. ఈ సమస్యలపై విద్యా సదస్సులో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

అసౌకర్యాల నడుమ ఆశ్రమాలు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అసౌకర్యాల నడుమ గిరిజన విద్యార్థులకు విద్యాబోధన సాగుతోంది. గిరిజన ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు 2019 నాటి మెస్ చార్జీలే ఇప్పటికీ ప్రభుత్వం చెల్లిస్తోంది. గత మూడున్నర ఏళ్లలో నిత్యావసరాల ధరలు అన్ని రెట్టింపైనా గిరి విద్యార్థుల మెస్ ఛార్జీలు ప్రభుత్వం పెంపుదల చేయలేదు. కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం రద్దు చేసింది. విద్యార్థులకు పంపిణీ చేసే నోట్స్ పుస్తకాలు, దుస్తులను సగానికి కుదించింది. ఆశ్రమాల్లో వాచ్‌మెన్, కుక్, కమాటి, ఏఎన్ఎం, హెల్త్‌వర్కర్ల నియామకాలు చేపట్టలేదు. విద్యార్థులకు అనారోగ్యం వస్తే ఆసుపత్రికి తీసుకెళ్లడానికి వాహన సదుపాయాలు అందుబాటులో లేవు. హాస్టల్స్‌లో వండి పెట్టేవారు కరువై విద్యార్థులు అర్ధాకలితో గడుపుతున్నారు.

సమస్యల నడుమ ఉపాధ్యాయులు

గిరిజన సంక్షేమ (విద్య) శాఖలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా వర్ణనాతీతంగా ఉన్నాయి. గిరిజన ఆశ్రమాల్లో బోధనేతర సిబ్బంది కొరతతో ఉపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్, హెల్త్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, చివరికి కుక్కు, కమాటీలు చేసే పనులు కూడా నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్ బాధ్యతల్ని నిర్వర్తిస్తూ కుక్, కమాటిలను తమ సొంత ఖర్చుతో నియమించు కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం ఎదురైనా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఉంది. జీవో 3 అమల్లో లేక ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవు. ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డీఈవో వంటి పోస్టులలో సీనియారిటీ ఉన్న అర్హులైన గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించ లేదు. పండిట్, పిఈటి అప్ గ్రేడేషన్ సమస్య పరిష్కారం కాలేదు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసే ఊసే లేదు. ఉన్న వసతి గృహాలు శిథిలమై మరమ్మతులకు నోచుకో లేదు. గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో భాషా వాలంటీర్ల నియమకాలు ఆపేశారు. గిరిజన సిఆర్టిల రెగ్యులరైజేషన్ తో పాటు పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి ఉపాధ్యాయులను ఐక్య పరిచేందుకు యుటిఎఫ్ ఈ విద్యా సదస్సును తలపెట్టింది.

గిరిజన విద్యారంగ సమస్యలపై ఈనెల 20న ఆదివారం ఉదయం 10 గంటలకు పాడేరు కాఫీ హౌస్ లో నిర్వహిస్తున్న విద్యా సదస్సు ఏర్పాట్లను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకే ఈ విద్యా సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ సదస్సును పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్‌జి, మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వర్లు కూడా హాజరవుతున్నారని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను నుంచి 14 ఐటిడీఏల పరిధిలో ఉన్న సుమారు 500 మంది ఉపాధ్యాయ ప్రతినిధులు ఈ విద్యా సదస్సుకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఎస్ రాష్ట్ర కార్యదర్శి అప్పలనరస, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి మహేశ్వరరావు, మాజీ కార్యదర్శి డి.రాము, అల్లూరి జిల్లా యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

సదస్సును జయప్రదం చేయండి

విద్యా సదస్సును ఈ నెల 20న ఆదివారం నిర్వహించేందుకు పాడేరు మోదకొండమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాట్లు చేశాం. గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్‌టిలు, భాష వాలంటీర్లు, గిరిజన విద్యా రంగ శ్రేయోభిలాషులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలి. ఉపాధ్యాయ ప్రమోషన్లు, సిఆర్టిల రెగ్యులరైజేషన్, ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియమకాలు వంటి సమస్యల్ని పరిష్కరించుకోవడానికి ఈ విద్యా సదస్సు వేదికగా ఉపాధ్యాయులు ఐక్యం కావాలి.

పి.మహేశ్వరరావు
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

భూ రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రీ సర్వే భూమి సరిహద్దుల గుర్తింపు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం

ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూ రీ సర్వే ద్వారా భూముల సరిహద్దులను గుర్తించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే అన్నారు. శనివారం మండలంలోని నల్లగొండ గ్రామంలో రీ సర్వేను రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు, ప్రైవేట్ భూములకు రీ సర్వే చేసి, అవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి సరిహద్దులు చూపించడం జరుగుతుందని చెప్పారు. నల్లగొండ గ్రామంలో రెండు సర్వే టీంలు, 9 మంది సర్వేయర్లతో ఈ సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వేలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు, తహశీల్దారు పిఎన్‌వి.ప్రసాద్, సర్వేయర్లు, వీఆర్వోలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి లలితకుమారి, జెడ్‌పిటిసి బాలాజీ

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మారేడుమిల్లి

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రెండో విడత నాడు నేడు పనులకు ఎంపీపీ సార్ల లలిత కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల చదువుకు పెద్ద పీట వేస్తుందని చెప్పారు. ఎంపీడీవో వీరకిశోర్ మాట్లాడుతూ నాడు నేడు పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యతతో నిర్మించి విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జి.బాలాజీ బాబు, వైసిపి మండల అధ్యక్షులు సత్తి సత్యనారాయణ రెడ్డి, సున్నంపాడు ఎంపీటీసీ అనిల్ కుమార్, స్థానిక సర్పంచ్ కొండ జాకోబ్, మండల కో-ఆప్షన్ సభ్యులు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతం

జామిగుడలో వంతెనకు శంకుస్థాపన

కట్టుదిట్టమైన భద్రతతో ఎంపీ, ఎమ్మెల్యేలు పర్యటన

ప్రజాశక్తి-పెదబయలు:మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతమైన జామిగూడ పంచాయతీలో శుక్రవారం అల్లూరి జిల్లా ప్రజాప్రతినిధులు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు సుడిగాలి పర్యటన చేశారు. ప్రింట్ మీడియాకు సమాచారం ఇవ్వకుండా మావోయిస్టు ప్రాంతంలో పోలీసు సెక్యూరిటీతో పర్యటించారు. జామిగూడ, గుంజివాడ మధ్యలో పెద్ద వాగు ఉండటంతో అనేక సందర్భాల్లో గిరిజనులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు గత నెలలో జిల్లా కలెక్టర్ పర్యటించి హామీ ఇచ్చారు. దీంతో అరకు పార్లమెంట్ సభ్యురాలు మాధవి, జిల్లా చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ఆగ్రో డైరెక్టర్ వనాల్బ సన్యాసిలు వంతెన నిర్మాణానికి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ జామిగూడ పంచాయతీ కేంద్రంలో పోలీసు సెక్యూరిటీ మధ్యలో గడప గడపమన ప్రభుత్వం నిర్వహించారు. మంచినీరు, సిసి రహదారులకు రూ.20 లక్షలు ఎమ్మెల్యే ఫాల్గుణ మంజూరు చేశారు. గడప గడప కార్యక్రమం నిర్వహిస్తున్న తరుణంలో ఒక వ్యక్తి వచ్చి తొందరగా వెళ్లిపోవాలని ఎమ్మెల్యేను కోరడంతో క్షణం కూడా ఆగకుండా తిరుగు ప్రయాణం అయ్యినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో జర్సింగి బాలం నాయుడు, సురేష్, గంపరాయి సూరయ్య, మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, సింహాచలం పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -అనంతగిరి: కార్తీక మాసం చివరి వారం కావడంతో విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పోటెత్తారు. మండలంలో ప్రముఖ పర్యాటన కేంద్రమైన బొర్రా గుహలకు శనివారం పర్యాటకులు పోటెత్తారు. శివలింగపురం, డముకు ఘాట్ రోడ్ యు పాయింట్, అనంతగిరి, బీసుపురం తదితర ప్రాంతాల్లో వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. కటికి, చిట్టంపాడు, తాడిగూడ జలపాతాలు సందర్శించి స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. కాఫీ ప్లాంటేషన్, అరకు సుంకరమెట్ట యూ పాయింట్ ప్రాంతమంతా జనాలతో కిటకిటలాడింది. ఆ ప్రాంతాల్లోని మార్గమధ్యలో కుటుంబ సమేతంతో సెల్ఫీలు దిగుతూ అందాలను తిలకించారు. ఘాట్ రోడ్‌లో వాహనాల రద్దీ నెలకొంది. బిసుపురం, సుంకరమెట్ట తదితర ప్రాంతాలలో కాఫీ ఉత్పత్తులు కొనుగోలు చేశారు. ఇదే మాదిరిగా టూరిస్టులు వస్తే వ్యాపారాలు బాగుంటాయని చిరు వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

సుంకరమెటలో పర్యాటకులు

జగనన్న క్రీడా సంబరాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జగనన్న క్రీడా సంబరాల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్:యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని చూపించాలని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సూచించారు. జగనన్న క్రీడా సంబరాల 2022 బ్రోచర్‌ను తలారిసింగిలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు జగనన్న క్రీడా సంబరాల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని చెప్పారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రభుత్వం నగదు బహుమతులను అందించనుందని తెలిపారు. గిరిజన యువతకు జగనన్న క్రీడా సంబరాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ, జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయిలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా క్రీడా ప్రధాన శిక్షకులు జగన్ మోహన్‌రావు, కోచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న పిఒ

విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

- పాడేరు ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గిరిజన విద్యార్థుల సంరక్షణపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ అదేశించారు. శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లోచలిపుట్టు జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాల (నెంబర్-1 స్కూల్)ను సందర్శించారు. పాఠశాల విద్యార్థి పాంగి నవీన్ మృతిపై ఆరా తీశారు. ఘటనపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ధైర్యంగా ఉండాలని మనోధైర్యాన్ని నింపారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టి, పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు అత్యవసరమైతే గాని సెలవులు పెట్టకూడదని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజిని, పాఠశాల హెచ్ఎం జివివి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి సొమ్ము చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉపాధి హామీ కింద చేసిన పనికి కూలి సొమ్ము చెల్లించాలని కోరుతూ మండలంలోని లోదొడ్డి, వాతంగి పంచాయితీలకు చెందిన గిరిజనులు శనివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తొలిత గ్రామంలో ర్యాలీ చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షులు కె.జగన్నాథం, సభ్యులు మేలిన రమేష్ మాట్లాడుతూ, లోదొడ్డి పంచాయతీ పరిధి పాక వెలితి, పూదేడు, కేశవరం, లోదొడ్డి, వాతంగి పంచాయితీలోని బట్టవారివీధి, ఒకుర్తి, ఓగి పాలెం, వాతంగి తదితర గ్రామాలలో అనేకమంది ఉపాధి కూలీలు పని చేసినప్పటికీ వారికి మూడు నెలలుగా కూలి డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. ఆయా గ్రామాలలో ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నా వారికి పని ఇవ్వడం లేదని, అనేకమంది అర్హులైనవారు ఉన్నా జాబుకార్డు లేవని చెప్పారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగిన గిరిజన రైతులకు 150 రోజుల ఉపాధి పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం.మురళి, పి సత్యనారాయణ, పి రమణమ్మ, పి లక్ష్మి, ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలు

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర-ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై మల్కనగిరి జిల్లా చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ పొట్టేరు ఇరిగేషన్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని ఇరు రాష్ట్ర అధికారులు నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో జులై నుంచి అక్టోబర్ చివరి నాటికి ఏయే రాష్ట్రాలు ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో లెక్కలు తేల్చారు. అక్టోబర్ చివరినాటికి ఆంధ్ర తన వాటాగా 12.0846 టీఎంసీలు, 2021-22 నీటి సంవత్సరంలో అధికంగా వినియోగించుకున్న 5.8765 టీఎంసీలతో కలిపి వినియోగించుకున్నట్లు, ఒడిశా 20.7044 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్ర అధికారులు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఒడిశా, ఆంధ్ర కంటే 8.6198 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు ధ్రువీకరించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో మొత్తం 65.9537 నీటి నిల్వలు ఉన్నాయని, ఇందులో ఆంధ్ర వాటా 37.2868 టీఎంసీలుగాను, ఒడిశా వాటా 28.6669 టీఎంసీలుగా అధికారులు నిర్ణయించారు. బలిమెల జలాశయంలో ఉన్న నీటిని ప్రస్తుత అవసరాల మేరకు ఈ రాష్ట్రాలు బలిమెల జలాశయం నుంచి 1000 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోవడానికి అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ సమావేశంలో ఒడిశా తరపున చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ సివిల్ చంద్రశేఖర్ మిశ్రా, బలిమెల హైడ్రో కార్పొరేషన్ జనరల్ మేనేజర్ బి.నారాయణ పాత్ర, జనరల్ మేనేజర్ జ్యోతిర్మయ దాస్, ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ జాకీ హుస్సేన్, డాం అండ్ పవర్ హౌస్ ఎడిఈ ఎం.లక్ష్మీనారాయణ, ఏడిఏ క్యాంప్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం సీలేరు అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి వేద పండితులు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప ఆలయ సమీపంలో సుమారు 1500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలలు ధరించిన అయ్యప్పలు 45 రోజులు దీక్ష పూని శనివారం రాత్రి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రకాల అయ్యప్ప గీతాలు ఆలాపించారు.

రాళ్లు తేలిపోయి అధ్వానంగా ఉన్న మఠం భీమవరం రహదారి

అధ్వానంగా మఠం భీమవరం రహదారి

ప్రజాశక్తి - కొయ్యూరు

మండలంలోని సుదూర పంచాయతీ మఠం భీమవరం గ్రామానికి వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. మండల కేంద్రానికి సుమారు 50 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ పంచాయతీకి వెళ్లాలంటే ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు పెద్ద పెద్ద బండరాళ్లు తేలిపోయాయి. కాలినడకన కూడా రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. పెద్ద వాహనాలే కాదు ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణించడానికి ఈ మార్గం అనుకూలంగా లేదు. దీంతో చుట్టూ తిరిగి సుమారు 140 కిలోమీటర్లు ప్రయాణించి, మండల కేంద్రానికి చేరుకునే పరిస్థితి నెలకొంది. తక్షణమే తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అర్హులైన లబ్ధిదారులందరికీ కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కింద్ర పంచాయితీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా పర్యటించి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నది ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపికి అడ్రస్ కూడా ఉండదన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసిపి నేత కనిగిరి వీరబాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే ధనలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచులు డి నాగు, చంద్రుడు, బి సత్యనారాయణ, ఎంపీటీసీ దుర్గా, వ్యవసాయ కమిటీ చైర్మన్ బి.వెంకటరమణ, వైసిపి నాయకులు డి వెంకటేశ్వరరాజు, ఎన్ కుశరాజు, సిహెచ్ ప్రసాద్, కె దుర్గాప్రసాద్, ఎ.సత్యనారాయణ, కె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

పాడేరులో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శాంతి భద్రతల పరిరక్షణకు పట్టణంలో నలు మూలాల, చుట్టు పక్కల ప్రాంతాల్లో 53 నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్.పి సతీష్ కుమార్ శనివారం సాయంత్రం మోదకొండమ్మ అమ్మ కల్యాణ మండపంలో వీటిని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి.మాట్లాడుతూ, విశాఖపట్టణం నుండి పాడేరు వచ్చు రహదారిలో అమ్మ వారి పాదాలు, వంట్లమామిడి, నక్కలపుట్‌లో ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో శతకం పట్టు సెంటర్, అంబేద్కర్ సెంటర్, వ్యాపార సముదాయం, జన రద్దీ ఎక్కువగా ఉన్న తదితర ప్రాంతాల్లో కూడలిలో 53 నిఘా కెమెరాలను స్థానికులు, వ్యాపారస్తుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, ప్రముఖుల రాకపోకల తాకిడి ఎక్కువగా ఉన్నందున శాంతిభద్రతలకు తావివ్వకుండా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని అన్నారు. అనంతరం సిసి కెమెరాలను అమర్చేందుకు సహకరించిన స్థానిక రాజకీయ నాయకులు, వ్యాపారులను ఎస్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎస్ఐలు లక్ష్మణ్, రంజిత్, వ్యాపార వేత్తలు, సర్పంచులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - అరకులోయ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా శాఖ, జిల్లా కలెక్టర్, ఐటి డిఎ పీఓ ఆదేశాలతో అరకులోయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో శనివారం రక్తదాన నిర్వహించారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో డిగ్రీ కాలేజీ విద్యార్థులు రక్త దానం చేశారు. అరకులోయ సిఐ జీడీ బాబు, ఎస్సై సంతోష్‌లు రక్త దానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.చలపతిరావు రక్త దానం చేసి విద్యార్థులను చైతన్య పరిచారు. పట్టాసి ఫౌండేషన్ సభ్యులు కూడా రక్త దానం చేశారు. 20 మంది రక్తం దానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్. గంగరాజు, సెక్రటరీ ఈశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్, డిగ్రీ కాలేజీ నోడల్ ఆఫీసర్స్ విజయలక్ష్మి, నాగబాబు, సుందర్‌రాణి, మేనేజింగ్ కమిటీ సభ్యులు గౌరీశంకర్, లోహితాస్, జయమ్మ, సింహాచలం, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ రాజబాబు, అప్పారావు, వెంకట్, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ చెప్పారు. స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి జానకమ్మల ఆధ్వర్యంలో లోగిలిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ చైర్మన్ రాజా రమేష్, సర్పంచులు నాగేశ్వరరావు, హరి, మహిళా నాయకురాలు శాంతి, లీలారాణి, వైసిపి మండల నాయకులు కే.సింహాచలం, గణపతి, సునీల్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో పెదగూడ పంచాయతీ సారధి గ్రామంలో అనారోగ్యంతో ఒకే కుటుంబానికి చెందిన వెచ్చంగి మోహన్‌రావు(63), వెచ్చంగి చిన్నమి (45), పాంగి సోంబారి (62) ముగ్గురు శనివారం చనిపోవడంతో ఆయా గ్రామాలతో పాటు పంచాయతీ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. గత కొద్ది రోజులుగా ముగ్గురు అనారోగ్యం బారిన పడి శనివారం తెల్లవారు జామున ముగ్గురూ మృతి చెందారు. కుటుంబ సభ్యులకు సర్పంచ్ మండి బాబురావు, ఎంపీటీసీ గణపతి సానుభూతిని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామన్నారు.

వనభోజనానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా బీసీ, మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో పద్మాపురం ఉద్యానవన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేస్తున్న వన భోజన కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ను బిసి మైనార్టీ సంఘాల ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి మైనారిటీ సంఘాల నాయకులు గద్దం నరసింగరావు, పట్నాల రాంబాబు, మురళి పట్నాయక్, కడలి శివ, ఎం.బుజ్జి, ఎస్ కే యాసిన్,రాజు, దివ్య పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ప్రజాశక్తి-హుకుంపేట: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ అంబులెన్స్‌లో ప్రసవించింది. మండలంలోని తీగలవలస పంచాయతీ పాములాయి గ్రామానికి చెందిన కే.సుందరికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో హుకుంపేట ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గ మధ్యలో ప్రసవించింది. అంబులెన్స్ సిబ్బంది గోవిందరావు ప్రసవం చేయించారు. తల్లీ బిడ్డ క్షేమంగాఉండటంతో హుకుంపేటకు తరలించి వైద్య సేవలు అందించారు

గిరిజనుడి లాడ్జిని కూల్చితే సహించం

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: గిరిజనుడు నిర్మించిన విజయ్ విలాస్ లాడ్జిని కూల్చాలని పంచాయతీ అధికారులు జారీ చేసిన నోటీస్‌లను వెంటనే రద్దు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పేర్కొన్నారు. జారీ చేసిన నోటీసు ఉప సహవరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం అరకువేలి గిరిజన భవనంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘించి బినామీ పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా గిరిజనేతరులు లాడ్జీలు నిర్మిస్తున్నా పంచాయతీ అధికారులు వారికి కొమ్ము కాస్తున్నారన్నారు. స్థానిక గిరిజనుడు నిర్మించిన విజయ్ విలాస్ లాడ్జిని కుల్చేందుకు నోటీసు జారీ చేయటం గిరిజన సంఘంగా తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. గిరిజనులు నిర్మిస్తున్న లాడ్జిని కుల్చడానికి నోటీసు ఇవ్వడం సరికాదన్నారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘించి అడ్డగోలుగా లాడ్జీలు నిర్మిస్తున్న గిరిజనేతరులకు సహకరిస్తున్న పంచాయతీ అధికారి పై చర్యలు తీసుకోవాలన్నారు. అరకులోయ గిరిజనేతరులకు భిన్నామిలోయగా మారిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు శాశ్వత నివాస గృహాలు నిర్మించ కూడదని చట్టంలో ఉన్నా కొంత మంది అధికారులు, ప్రజాప్రతినిదులు కొమ్ము కాస్తు సహకారాలు అందిస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులు బహుళ అంతస్తుల భవనాలు, లాడ్జిలు నిర్మించి అడ్డగోలుగా వ్యాపారం సాగిస్తున్నారని, వారిపై పంచాయితీ, రెవిన్యూ అధికారులు, చూసీ చూడనట్టు ఉండి పట్టించుకోలేదని చెప్పారు. జారీ చేసిన నోటీసు తక్షణమే అధికారులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, నాయకులు పి.చిన్నబాబు, కె జగన్నాధం పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం : సిఐ

ప్రజాశక్తి-అరకులోయ: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడానికి పోలీస్ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం ద్వారా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ జిడి బాబు అన్నారు. అరకులోయ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జీడి బాబు మాట్లాడుతూ, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జాబ్ మేళా లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా ఈనెల 18న అరకులోయ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని ఆయన అన్నారు. ఈ జాబ్ మేళాలో 604 మంది హాజరవ్వగా, అందులో 164 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.పోలీస్ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ14 కంపెనీలకు చెందిన వారు పాల్గొని ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని కంపెనీలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యం అన్నారు. గతంలో స్ఫూర్తి అనే ప్రోగ్రామ్ ద్వారా అనేకమందికి ఉపాధి కల్పించినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎస్సై సంతోష్, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు కళ్యాణి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిఐఎస్ఎఫ్, బి ఎస్ఎఫ్ఏఆర్, ఎస్ఎస్‌బి, ఐటి బిపి కానిస్టేబుల్ పోస్టుల కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రభుదాస్, భగత్‌రాం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ సిఐటియు 6వ మండల మహాసభ ఈ నెల 17న గురువారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించారు .ఈ మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి, కనీస వేతనం అమలు చేయాలని పలు తీర్మానాలు చేశారు. ఈ మహాసభలో మండల నూతన కమిటీ ఎన్నిక సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి బాలదేవ్‌ల సమక్షంలో జరిగింది. సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ ప్రభుదాస్, జె భగత్ రాం, ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా లక్ష్మీ, కొండలరావు, కొండమ్మ, ఒనాది, సహాయ కార్యదర్శులుగా వి.సింహాద్రి, డి.రాజు, సత్యవతి, కోశాధికారిగా కె.మగ్గన్న మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష కార్యదర్శి మాట్లాడుతూ, కార్మికుల వర్గ సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు.

సంపద కేంద్రాలకు రిక్షాలు సిద్ధం

ప్రజాశక్తి-పెదబయలురూరల్

పెదబయలు మండలంలో 23 గ్రామ పంచాయతీలకు తడి పొడి చెత్త సేకరించేందుకు 23 రిక్షాలు వచ్చాయని ఈవోపిఆర్డి నరసింగరావు విలేకర్లకు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు వినియోగించిన చెత్త కాగితాలు, వాటర్ బాటిల్స్, తడి పొడి చెత్త వేరు వేరుగా సేకరించేందుకు సచివాలయ పరిధిలో సంపద కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రత పాటించాలని సూచించారు.

సిద్ధంగా ఉన్న రిక్షాలు

రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను సందర్శించిన సీపీ

ప్రజాశక్తి -కంచరపాలెం : ఆర్ అండ్ బి కూడలి సమీపంలోని రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ శనివారం సందర్శించారు. ఈ మేరకు ల్యాబ్‌లో వినియోగిస్తున్న పరికరాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సైబర్ ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, అందులో భాగంగానే భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆర్ఎఫ్ఎస్ఎల్‌లో డిఎన్ఎ నిర్ధారణ పరికరాలు గుజరాత్ నుంచి వచ్చాయని, వాటి అమరికకు సంబంధించి పనులు చేపట్టినట్లు చెప్పారు. పరికరాలు అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోక్సో, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించి త్వరితగతిన కేసును ఛేదించేందుకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట వెస్ట్ సబ్ డివిజన్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, ఎయిర్‌పోర్టు సిఐ బిఎండి ప్రసాదరావు, కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కంచరపాలెం, సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి రెడ్డి కంచరపాలెంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశికళ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డులో పర్యటించారు. జోగరావునగర్, రెడ్డికంచరపాలెంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇ భరణికుమార్, ఎఇ అర్చన, వార్డు అధ్యక్షులు దుప్పలపూడి శ్రీనివాసరావు, కెపి.రత్నాకర్, నాయకులు బొండేటి గంగామహేష్, పాల్గొన్నారు.

45వార్డులో...

సీతమ్మధార : జివిఎంసి 45వార్డు తాటిచెట్లపాలెం పెట్రోల్ బంక్ వద్ద రూ.20 లక్షలతో డ్రైనేజీ, గెడ్డ రిటైనింగ్ వాల్, సీసీ రోడ్లు, డ్రైన్ తదితర అభివృద్ధి పనులకు సంబంధించి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్ ఆధ్వర్యాన కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ, రాజు యాదవ్, నాయుడు, నేపాల్ శ్రీను, బాబూరావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి శాంతినగర్, కస్తూరినగర్ కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ పరిశీలించారు. కస్తూరినగర్ నుంచి మధుసూదన్‌నగర్ వరకు నుంచి నిర్మిస్తున్న బిటి.రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులో సుమారు రూ.3 కోట్ల అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. మరో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న జివిఎంసి కమిషనర్, మేయర్‌కు, ఉత్తర నియోజక సమన్వయ కర్త కెకె.రాజు ధన్యవాదాలు తెలియజేశారు.

పాఠశాలల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- కంచరపాలెం : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో మధ్యాహ్నం భోజనం పథకం అమలు తీరుతెన్నులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ జి.స్వరూపరాణి ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి విశాఖ జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతగిరి మండలం కాశీపట్నం ఎంపియుపి పాఠశాల, మండపర్తి జి.పి.టి.డబ్ల్యు పాఠశాల, భీమిలి మండలం రాయపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్, పద్మనాభం మండలం రెవిడి వెంకటాపురం ప్రాంతంలో జడ్పీ హైస్కూల్ తదితర పాఠశాలలో ఏకకాలంలో తనిఖీలు చేశారు. గుర్తించిన లోపాలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు బృందాల సభ్యులు తెలిపారు.

కల్వర్టు పునర్నిర్మాణం చేపట్టరూ...

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతలపూడి-గింజర్తి గ్రామాల మధ్య కల్వర్టు పునర్నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికి మరమ్మతులు చేయాలని ఎంత మొరపెట్టుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కల్వర్టు నిర్మాణం కలగానే మిగిలిపోతుందా? అని వాపోతున్నారు. ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాల్సిన వాహనచోదకులు తప్పనిసరి పరిస్థితుల్లో సింగరాళ్లపాడు, లొద్దిపాకలు మీదుగా మరికొన్ని కిలోమీటర్లు దూరం ఎక్కుగా ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు పునర్నిర్మాణం చేయాలని ఆయా గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

వినోద్‌బాబు బాధ్యతల స్వీకరణ

సంతకం చేస్తున్న వినోద్‌బాబు

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మద్దిల వినోద్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న సాయిరాం, కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్, హిస్టరీ లెక్చరర్ దివ్య తదితరులు ప్రిన్సిపల్ వినోద్‌బాబును సాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎలమంచిలిలో నాలుగు సంవత్సరాలు ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ, ఇన్‌ఛార్జి ఆర్ఐఒగా ఏడాది పాటు బాధ్యతలు నిర్విర్తించినట్లు చెప్పారు. నాడు-నేడు నిధులతో సీలేరు జూనియర్ కళాశాలను రూపురేఖలు మార్చడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం క్లాస్ రూములకు వెళ్లి విద్యార్థులకు పరిచయం చేసుకున్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి - సీలేరు : విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, విద్య పైనే దృష్టి సారించాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ హితవుపలికారు. జికె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. కౌమార దశలో విద్యార్థులకు కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల అనేక అనర్థాలకు దారితీసి, విద్యలో రాణించలేక భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. 10వ తరగతి పాసైన వారు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ ద్వారా సిఆర్పిఎఫ్ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

గిరిజన చిన్నారులకు అన్నదానం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలం బూదరాళ్ల పంచాయతీ పరిధి, దూరపాలెం గ్రామంలో 100 మంది గిరిజన చిన్నారులకు కొయ్యూరు దుమంతి సత్యనారాయణ అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద అడవి బిడ్డలకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతినెలా తన వంతుగా అన్నదాన కార్యక్రమం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమంత్ సత్యనారాయణ, దూరపాలెం ఉపాధ్యాయుడు మొట్టడం చిన్ని, షడ్డ వెంకటేశ్వర్లు, దుమంతి భరత్, కిరణ్, నరేష్, సాత పండు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ విశ్వవిద్యాలయం (ఇగ్నో) 37వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఇగ్నో ప్రధాన కార్యాలయంతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న ఇగ్నో ప్రాంతీయ కార్యాలయాలన్నింటిలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. 37 ఏళ్లుగా దేశంలో దూరవిద్యకు మార్గదర్శనం చేస్తూ, ఉన్నత విద్యను సామాన్యులకు చేరువ చేయడంలో, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా లక్షలాది మంది విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఉన్నత విద్యను అందించడంలో ఇగ్నో పాత్ర గణనీయమైందన్నారు. కార్యక్రమంలో ఇగ్నో విశ్రాంత ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా సంక్షేమ పాఠశాలలు

మంత్రి మేరుగ నాగార్జున

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సాంఘిక సంక్షేమ స్కూళ్లు, వసతి గృహాలను తీర్చిదిద్దుతున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శ్రీకృష్ణాపురంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పరిసరాలను, తరగతి గదులను, గ్రంథాలయాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాబోధన ఎలా ఉంది ? మీరు ఎక్కడ నుంచి వచ్చారు ? వసతి గృహంలో సదుపాయాలు ఎలా ఉన్నాయి ? రోజూ ఇలానే భోజనం పెడుతున్నారా ? మెనూ ప్రకారం భోజన ఇస్తున్నారా ? తదితర విషయాలను విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేసినట్టు తెలిపారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించే విధంగా ప్రణాళికలను రూపొందించినట్టు చెప్పారు. పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగులకు జీతాలు పెంచే ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు 13వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, వార్డు వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సమన్వయకర్త రూపావతి, డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తి, రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

నాడు - నేడు పనులతో సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు మహర్దశ వస్తోందని, నాణ్యమైన మెనూ, ఇంగ్లీష్ మీడియం విద్యతో ఏపిని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నాగార్జున అన్నారు. శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అందుతున్న అన్ని పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

26 నుంచి ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఆవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26 నుంచి తెలుగు శక్తి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్, వీడియోలను శనివారం అమరావతిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. అందుకు సంబంధించిన వివరాలను రామ్ మీడియాకు తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందన్నారు. ఈ నెల 26న ఇచ్చాపురం నుంచి ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనుమతి కోరుతూ డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చానన్నారు.

ఉత్సాహంగా గిరిజన క్రీడా పోటీలు

క్రీడా జ్యోతి అందుకుంటున్న రవిబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గిరిజన గౌరవ దినోత్సవంలో భాగంగా రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడా పోటీలు గీతం యూనివర్సిటీలో శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి క్రీడా రంగానికి, గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గిరిజన విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలని, అందుకు అనుగుణంగా శిక్షణ తీసుకోవాలని కోరారు. గిరిజనులు ఎంతో దృఢంగా, బలంగా ఉంటారని క్రీడల్లో రాణించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారానూ ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని, తనకు క్రీడలంటే ఇష్టమని అన్నారు. క్రీడా రంగంలో ఎటువంటి అవసరం ఏర్పడ్డా తనను కలవాలన్నారు. గీతం యూనివర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ మురళీ కార్తీక్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ ద్వారా క్రీడల్లో రాణించేవారికి స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిన్నబాబు, రాష్ట్రంలోని 8 ఐటిడిఎల పరిధిలోని క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్కార కార్యక్రమంలో సూరజ్ గనోరే

వైద్య సేవలతో గుర్తింపు

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రజలకు మంచి వైద్య సేవలు అందించిన వైద్యాధికారులకు గుర్తింపు ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన నేపథ్యంలో సంబంధిత వైద్యులు డాక్టర్ నూర్జహాన్ బేగం, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ప్రభాత్, డాక్టర్ బికె.వంశీకృష్ణ, డాక్టర్ మహేష్‌రెడ్డి తదితరులు శనివారం పిఒ సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాలను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. పిఒ, సబ్ కలెక్టర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచి మాటలతో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నరేష్, రాధిక, భాస్కర్, సాయి రతన్, ఏడిఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది పీటర్, రత్న ప్రసాద్, విజయ, నాగరాజు, వీరలక్ష్మి, ఝాన్సీ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు,

స్టీల్‌ప్లాంట్‌లో కన్వేయర్ బెల్ట్ దగ్ధం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని ఆర్ఎంహెచ్‌పి విభాగంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో కన్వేయర్ బెల్ట్ కాలిపోవడంతో సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. కన్వేయర్ బెల్ట్ రన్నింగ్‌లో ఉండగా మంచుకు గడ్డకట్టుకుపోయిన బొగ్గు రాపిడికి గురికావడంతో మంటలు ఏర్పడ్డాయి. అవి పెద్దవి కావడంతో ఉద్యోగులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇది రన్నింగ్ కన్వేయర్ బెల్ట్ కావడంతో అక్కడ ఎవరూ లేదు. దీంతో ప్రాణనష్టం తప్పింది. సబ్ లైన్ కావడం వల్ల ఉత్పత్తికి ఎలాంటి ఆటంకమూ కలగలేదని అధికారులు తెలిపారు. కేవలం ఆస్తి నష్టం మాత్రమే వాటిల్లిందన్నారు.

ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టండి

ప్రజాశక్తి - మధురవాడ : ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. శనివారం ఆయన జోన్-2 పరిధిలోని ఆరిలోవ, పోతినమల్లయ్యపాలెం, కొమ్మాది, మారికవలస తదితర ప్రాంతాలలో నిర్మిస్తున్న కొన్ని భవనాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లానుకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్లానులు మంజూరు చేసేటప్పుడు స్థలానికి వెళ్లి ఆయా ప్రాంతాలను పరిశీలించిన తరువాత.. అన్నీ సక్రమంగా వుంటేనే అనుమతులు ఇవ్వాలన్నారు. ఆరిలోవలో కాంచీ హాస్పిటల్, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ హాస్పిటల్, పోతినమల్లయ్యపాలెంలో సాయిప్రియ గార్డెన్స్‌లో వైశాఖి డెవలప్‌మెంట్ బిల్డర్స్ ప్లాన్‌ల ప్రకారం నిర్మిస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. కొమ్మాదిలో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ లే-అవుట్ తుది అనుమతి కోసం వచ్చినందున ఆ ప్రాంతాన్ని సందర్శించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మారికవలసలో వైఎస్ఆర్ కాలనీలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు పెట్టుకున్న దరఖాస్తు ఆధారంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. అలాగే దాని పక్కనే ఉన్న పవన మిత్ర అపార్టుమెంట్‌నూ సందర్శించారు.

18న వైజాగ్ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 18న నిర్వహించనున్న మొదటి ఎడిషన్ సంధ్యా మెరైన్స్ వైజాగ్ మారథాన్ కార్యక్రమానికి సంబంధించిన టీషర్ట్, మెడల్ ఆవిష్కరణ కార్యక్రమం నగరంలోని నోవొటెల్ హోటల్‌లో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ హాజరయ్యారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణా రాయ్, కార్యదర్శి శ్రీనివాస్, సంధ్యా మెరైన్స్ ఎమ్‌డి ఆనంద్ పాల్గొన్నారు.